వరి గోస!

సాగుపై అన్నదాతలకు తగ్గుతున్న ఆసక్తి

- సరైన ప్రోత్సాహం, వాతావరణం అనుకూలించక వెనుకంజ
- ఐదేళ్లలో 9,139 ఎకరాలు తగ్గిన వైనం
- ఆక్వా వైపు రైతుల మొగ్గు

పెడన: ఆరుగాలం కష్టపడ్డా చేతికి వస్తుందో రాదో.. ఎందుకు ఈ తలనొప్పులు.. కౌలుకు ఇద్దామా.. లేక లీజుకు ఇచ్చేద్దామా అనే ఆలోచనల్లో రైతులు ఉండటంతో క్రమేపీ వరి సాగు ప్రశ్నార్థకం అవుతోంది. ఇప్పటికే కొందరు రైతులు ఆ దిశగా అడుగులు వేయడంతో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. పెడనలో 2019–2020లో పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను ఈ నాలుగు మండలాల్లో 67,953 ఎకరాల్లో వరి సాగయ్యేది. ఈ సాగు కాస్తా ఏటా తగ్గుతూ రావడంతో ప్రస్తుతం 58,814 ఎకరాలకు చేరింది. ఇది మరింత పడిపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

విపరీతంగా పెరిగిన ఖర్చులు..

వ్యవసాయంలో దుక్కిదున్నడం మొదలు.. విత్తనాలు నాటి ఎరువులు వేసి, రసాయనాలు జల్లి, కలుపు తీయించి పంటను కాపాడుకుంటూ అహర్నిశలు శ్రమిస్తే.. తీరా పంట చేతికి వచ్చే తరుణంలో వరుణుడు విజృంభిస్తే పరిస్థితి అంతే. చేతికి వచ్చిన పంట కాస్తా తుపానులు మింగేస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆలోచనల్లో కొందరు రైతన్నలు తమ పంట పొలాలను చెరువులుగా చేసుకునేందుకు లీజుకు ఇచ్చేస్తున్నారు. ఎకరానికి ఏడాదికి రూ.50వేలు నుంచి రూ.60వేలు వరకు లీజు కింద వస్తుంది. ఇదే మంచిదనే ఉద్దేశంతో చాలా మంది రైతులు వ్యవసాయం వదిలి చెరువులకు ఇచ్చేస్తున్నారు. వరి సాగు విస్తీర్ణం తగ్గుతోందనే అభిప్రాయం చాలా మంది వ్యక్తం చేస్తున్నారు.



పెడన నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

ఐదేళ్ల కిందట వరి సాగు 67,953 ఎకరాలు

ప్రస్తుత సాగు విస్తీర్ణం 58,814 ఎకరాలు

మండలాల్లో సాగు విస్తీర్ణం ఇలా..

- పెడన మండలంలో 2019–20లో వరి సాగు 24,180 ఎకరాల్లో ఉంటే అది కాస్తా 2023–24కు 20,482 ఎకరాలకు వచ్చింది.
- బంటుమిల్లి మండలంలో 2019–20లో 16,323 సాగు అవ్వగా.. 2023–24లో 13,358 ఎకరాలు సాగైంది.
- కృత్తివెన్ను మండలంలో 6,200 నుంచి 5,224కు పడిపోయింది.
- గూడూరు మండలంలో 21,250 ఎకరాల సాగు నుంచి 19,750 ఎకరాలకు సాగు తగ్గింది. ఈ విధంగా తగ్గుతూ పోతే భవిష్యత్తులో వరిసాగు అయ్యేది చాలా తక్కువగా ఉంటుందేమోననే భయం కూడా మండలంలోని కొందరు రైతుల్లో వెంటాడుతోంది.

మద్దతు ధర రావడం లేదు



పంట పండించడానికి ఖర్చులు బాగా పెరిగాయి. కూలీలు, విత్తనాలు, ఎరువుల ధరలు పెరుగుతూ వస్తున్నాయే తప్ప ఏనాడు తగ్గడం లేదు. మరో పక్క పండించిన పంటకు మాత్రం ధర ఉండటం లేదు. పంట నష్టపోయినా పరిహారం వస్తుందో రాదోనని ఎదురుచూడాలి. వస్తే సరి, రాకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిందే. దీంతో వ్యవసాయంపై ఆసక్తి తగ్గిపోతుంది. మరో పక్క చెరువులకు లీజుకు ఇస్తే ఇంట్లో కూర్చుంటే ఏడాదికి రూ.60వేలు ఇస్తామంటున్నారు. నేనే కాదు చాలా మంది రైతులు చెరువుల వైపు ఆసక్తి చూపుతున్నాం.

– మురాల ఆది, లక్ష్మీనారాయణపురం, బంటుమిల్లి మండలం

ఆక్వారంగంపై ఆసక్తి..



సొంత భూములున్న రైతులు మాత్రమే వ్యవసాయాన్ని వదిలి ఆక్వా రంగం వైపు దృష్టి సారిస్తున్నారు. కొందరు సొంతంగా చెరువులుగా చేసుకోగా, మరికొందరు లీజుకు ఇచ్చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో ఒడిదుడుకులు అధికంగా ఉండటంతో పాటు ఖర్చులు బాగా పెరిగాయని రైతులంటున్నారు. కృత్తివెన్ను మండలంలో వ్యవసాయం బాగా పడిపోయింది. బంటుమిల్లిలో ఇప్పుడిప్పుడే తగ్గుతోంది. రానురాను వ్యవసాయం మరింత తగ్గే అవకాశాలు లేకపోలేదు.

– బి. గోపాల్, ఏడీఏ, బంటుమిల్లి, పెడన నియోజకవర్గం

క్లుప్తంగా

ఖాతాలు తెరవడానికి మహిళలు పోస్టాఫీస్ బాట



పెడన: పట్టణంతో పాటు మండలంలో ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సర్వే చేస్తుండటంతో బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ కాని వారు, అసలు బ్యాంకు ఖాతాలు లేని మహిళలు అకౌంట్లు తెరవడానికి పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వం డీబీటీ కింద పథకాల నగదు జమ చేస్తుందని మహిళలు పోస్టాఫీసు బాట పడుతున్నారు. నెలకు రూ.1,500 వేస్తామని డే కూటమీ హామీ ఇవ్వడంతో బ్యాంకు ఖాతాను ఆధార్‌కు అనుసంధానం తప్పనిసరి చేయాల్సిందేనని సచివాలయ ఉద్యోగులు పేర్కొనడంతో తాము పోస్టాఫీసుకు ఖాతా తెరవడానికి వచ్చినట్లు మహిళలు పేర్కొంటున్నారు.

వరి పొలాల పరిశీలన



వెంకటాపురం(మోపిదేవి): రబీ సీజన్‌కు వరి పంట తర్వాత వేసుకునే మినుము విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి హెబ్సీబా రాణి తెలిపారు. గురువారం పంట పొలాలు పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మాగాణి భూమిలో వేసుకునే మినుము విత్తనాలు వ్యవసాయ శాఖ నుంచి రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మినుములు కేజీ ధర రూ. 98, 4 కేజీల బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు ఆమె వివరించారు.

రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ



పెడన: రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని బంగ్లా స్కూల్ విద్యార్థులతో కలిసి ఎంఈవో–2 వై.హరనాథ్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో మండల స్థాయిలోని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారు జిల్లాస్థాయిలో శుక్రవారం జరిగే పోటీలకు హాజరుకావాల్సి ఉంటుందని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో బంగ్లాస్కూలు హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైడమ్మ సన్నిధిలో ఉచిత దర్శనానికి వినతి

పెడన: పైడమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని భక్తులకు ఉచిత దర్శనం కల్పించాలని హిందూ బంధువుల ఐక్యవేదిక సభ్యులు ఆలయ ఈవో టీవీవీ మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల సమయంలో భక్తులకు ఉచిత దర్శనం విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఈవో ఐక్యవేదిక సభ్యులకు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, శివశక్తి, బీజేపీ, హిందూ బంధువుల ఐక్యవేదిక సభ్యులున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కోడూరు: దింటిమెరక గ్రామంలో గురువారం నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.9.90లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రహదారిని నిర్మిస్తున్నారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కృత్తివెన్ను: మండలంలోని చినగొల్లపాలెం, గరిశపూడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు గురువారం బందరు ఎంపీ బాలశౌరి, స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శంకుస్థాపనలు చేశారు. చినగొల్లపాలెం దీవిలో రూ. 40 లక్షల అంచనాలతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి, గరిశపూడి వద్ద నుంచి చందాల మీదుగా పడతడిక వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రూ. 4 కోట్ల అంచనాలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పంచకర్ల సురేష్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, బీజేపీ నేత దాసరి వెంకట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డీకే బాలాజీని ఎంయూడీఏ చైర్మన్ మట్టా ప్రసాద్ గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న మట్టా ప్రసాద్‌ను ఎంయూడీఏ చైర్మన్‌గా నియమించింది.

'కొడాలి'కి క్రైస్తవ సామాజిక సేవా పురస్కారం



ఘంటసాల: క్రైస్తవ సమాజానికి అందించిన సేవలకు గుర్తింపుగా ఘంటసాల గ్రామానికి చెందిన అమ్మ నాన్న ట్రస్టు అధినేత కొడాలి భక్తపాల్‌కు గురువారం న్యూఢిల్లీలో క్రైస్తవ సామాజిక సేవా పురస్కారం లభించింది. నేషనల్ ఇండిపెండెంట్ బిషప్స్ కౌన్సిల్ ఇండియా ఆధ్వర్యంలో అవార్డ్ ప్రదానం చేశారు. పలువురు ప్రముఖులు, గ్రామస్తులు అభినందించారు.

కమనీయం.. కార్తిక దీపోత్సవం



అయ్యప్ప దేవాలయంలో దీపకాంతులు



శివలింగాకృతి చుట్టూ దీపాలు

కోడూరు: కార్తిక మాసం పురస్కరించుకుని కోడూరు అయ్యప్పస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ గురుస్వామి ఆధ్వర్యంలో దీక్షాధారులు మూలమూర్తికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం కార్తిక దీపోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణాన్ని దీపాలతో అలంకరించారు. శివలింగాకృతి, స్వస్తిక్, వివిధ రంగవల్లుల ఆకారాల్లో భక్తులు దీపాలను వెలిగించి భక్తిభావం చాటారు.

'సూర్యఘర్'కు ఉదారంగా రుణాలివ్వండి

బ్యాంకర్లతో కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి బ్యాంకర్లు ఉదారంగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఏపీసీపీడీసీఎల్, లీడ్ బ్యాంక్ మేనేజర్‌లతో కలిసి విద్యుత్‌శాఖ, బ్యాంకర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణహితమైన సంప్రదాయేతర ఇంధన వనరులు వినియోగించుకుంటే కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం కింద సోలార్ ఎనర్జీని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు వినియోగదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానందం, ఎల్‌డీఎం జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మత్స్య పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తు

ఘంటసాల: మత్స్య పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం.. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ మత్స్య దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మత్స్యకారులకు గుర్తింపు అందించడానికి, ఆరోగ్యకరమైన సముద్ర పర్యావరణ వ్యవస్థల ప్రాముఖ్యతను తెలియజేయడానికి దినోత్సవం జరుపుకుంటున్నట్లు చెప్పారు.

కేవీకే మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ మత్స్యకార సొసైటీ చెరువుల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ మంజువాణి, డాక్టర్ రేవతి, కృష్ణవేణి, డాక్టర్ వెంకటలక్ష్మి, మత్స్యకారులు పాల్గొన్నారు.



ఘంటసాల కేవీకే చెరువు వద్ద మత్స్యకారులతో సమన్వయకర్త డాక్టర్ సుధారాణి, శాస్త్రవేత్తలు

రైతు సేవాకేంద్రాలతో.. 48 గంటల్లో నగదు జమ

ఘంటసాల: రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల్లో నగదు జమ అవుతాయని మండల వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఘంటసాల వెలుగు కార్యాలయంలో తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అధ్యక్షతన రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుపై గ్రామ స్థాయి కమిటీ సభ్యులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పీఏసీఎస్ సీఈవోలు, డీసీఎంఎస్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా సజావుగా ధాన్యం సేకరణ చేయడానికి గ్రామ, మండల స్థాయి కమిటీలను వేసినట్లు చెప్పారు. ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో షెడ్యూలింగ్ చేయించుకుని జీపీఎస్ ఉన్న వాహనం ద్వారా ట్రక్ షీట్‌తో ధాన్యాన్ని మిల్లర్లకు తరలించిన వారికే 48 గంటల్లో నగదు జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ రైతుల ప్రతినిధి వేమూరి సాయి వెంకట రమణ, వీఏఏలు, పీఏసీఎస్ సెక్రటరీలు, రైతు ప్రతినిధులు, మిల్లర్లు పాల్గొన్నారు.

నేడు కాలభైరవస్వామికి అభిషేకం

పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీగంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలోని కాలభైరవస్వామికి అభిషేకం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు గూడూరు ఆగస్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు ఈ అభిషేకం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28న అంతరాలయంలోని చిన నందీశ్వరునికి, పెద నందీశ్వరునికి సాయంత్రం 5.30 గంటలకు అభిషేకాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

వృద్ధుడి శరీరదానం



సుబ్బారావు (ఫైల్)

నాగాయలంక: వృద్ధుడి శరీరాన్ని దానం చేశారు. స్థానిక 2వ వార్డుకు చెందిన కొడాలి సుబ్బారావు (85) శరీరాన్ని, నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. అనారోగ్యంతో సుబ్బారావు గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న సుదర్శి మానవతా సేవాసమితి నిర్వాహకులు తలశిల రఘుశేఖర్.. సుబ్బారావు కుమార్తె ఉషారాణి, అల్లుడు రాము, కుమారుడు కొడాలి సత్యనారాయణ, మనువడు తలశిల వెంకటేష్‌తో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడగా నేత్రదానంతో పాటు శరీరదానానికి ఒప్పుకున్నారు. వెంటనే రఘుశేఖర్ విజయవాడ ఎల్వీ ప్రసాద్ వైద్యశాలకు, ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాలకు సమాచారం ఇచ్చారు. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు మృతుని నేత్రాల నుంచి కార్నియాను సేకరించి తీసుకెళ్లగా, ఆశ్రమం వైద్యశాల నుంచి వచ్చిన వారు సుబ్బారావు దేహాన్ని తీసుకెళ్లారు. సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా 214వ రక్తదానం కాగా, 9వ శరీర దానం జరిగినట్టు రఘుశేఖర్ తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

మచిలీపట్నంటౌన్: సత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఈడేపల్లిలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. వృద్ధాశ్రమంలో సాయిబాబా భక్తులు నామ సంకీర్తన చేశారు. శీతాకాలం దృష్ట్యా వృద్ధులకు వ్యాజ్‌లైన్, బామ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్, భక్తులు వై.సాయిబాబు, వరప్రసాద్, వై.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఇంటర్వ్యూలు



చిలకలపూడి(మచిలీపట్నం): బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మూడు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టులకు సంబంధించి ఖాళీలను భర్తీ చేయడానికి గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రాజెక్టుల పరిధిలోని మినీ అంగన్‌వాడీ మూడు పోస్టులకు ఎనిమిది మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 17 హెల్పర్ పోస్టులకు 38 మంది హాజరయ్యారు. వీరిని బందరు ఆర్డీవో స్వాతి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో సుధీర్‌బాబు, సీడీపీవోలు సముద్రవేణి, గ్లోరి, డి.సుధారాణి ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తుదారుల విద్యార్హతలు, అధికారులు అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాల మేరకు మెరిట్ లిస్ట్ తయారుచేస్తామని దీన్ని కలెక్టర్ డీకే బాలాజీకి అందజేయనున్నట్లు పీడీ సువర్ణ తెలిపారు.

విద్యార్థినుల సామూహిక సాయివ్రతాలు



అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థలో గురువారం కార్తిక మాసం సందర్భంగా షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు – వెంకట వసుమతి దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్ముల సాంబశివరావు గురువు ఆశీస్సులతో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు సామూహిక సాయిసత్యవ్రతాలు, విరాట్ సాయి స్తోత్రం, నిత్యప్రార్థన చేశారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

•మందుబాబులం.. మాకు మేమే మహారాజులం



మందుబాబులం.. మేము మందుబాబులం మందుకొడితే మాకు మేమే మహారాజులంటూ.. రహదారినే బార్‌గా మారుస్తున్నారు కొందరు. అదెక్కడంటే పెడన ప్రధాన రహదారి వద్దకు వస్తే తెలుస్తుంది. ఆ రోడ్డుపక్కన వైన్‌షాపు ఉంది. అక్కడ మద్యం కొనుగోలు చేస్తున్న కొందరు మందుబాబులు.. పక్కనే పోస్టాఫీస్ రోడ్డు అరుగు మీదే బహిరంగంగా మందు తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. గట్టిగట్టిగా అరుచుకుంటూ వీరంగం వేస్తున్నారు. దీనిపై స్థానిక మహిళలు ఫిర్యాదులు చేసినా పోలీసు చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. అయితే మందుబాబులు పడేస్తున్న గ్లాసులు, సీసాలను పారిశుధ్య సిబ్బంది ఠంచన్‌గా తొలగించడం గమనార్హం. పోలీసులు స్పందించి మందుబాబుల చర్యలను అరికట్టాల్సి ఉంది. –పెడన

పైడమ్మ చెరువు వద్ద హెచ్చరిక బోర్డులు

సాక్షి ఎఫెక్ట్

పెడన: పైడమ్మ చెరువులో చేపల పెంపకం దారులు పాటపాడుకుని చెరువులో చేపలు పెంచుకుంటుంటే ఆ నీటిలో కలంకారి వస్త్రాలను నీళ్లతీత తీస్తూ నీటిని పాడు చేస్తున్నారు. దీనిపై పురపాలక అధికారులకు, మీకోసంలో కలెక్టర్‌కు పాటదారుడు ఫిర్యాదు చేశాడు. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఇక్కడి సమస్యపై ఈ నెల 20న 'అధికారుల నిర్లక్ష్యం...ఆదాయానికి గండి' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి చెరువు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నారు. ఒకపక్క చెరువు గట్టుపై పరదాలు కట్టించారు. పురపాలక చెరువులో ఎవరైనా కలంకారి వస్త్రాలను గుంజినా, మురుగునీరు వదిలినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరికబోర్డులు పెట్టించారు. వీటిని గురువారం మున్సిపల్ ఆర్ఐ వెంకటేశ్వరరావు పరిశీలించారు.



హెచ్చరిక బోర్డు వద్ద ఆర్ఐ వెంకటేశ్వరరావు

కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహించింది. జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 2024 లో డిగ్రీ పూర్తి చేసిన దాదాపు 350 మంది ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరయ్యారు. డ్రైవ్‌లో బెల్ సంస్థ నిర్వహించిన రాత పరీక్షకు కావలసిన అన్నీ సదుపాయాలను కృష్ణా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల కల్పించింది. కృష్ణా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు వాసవి, గుడ్లవల్లేరు, ఉషారామ తదితర కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు.



రాత పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఎస్పీని కలిసిన సర్వజన ఆస్పత్రి సిబ్బంది

కోనేరుసెంటర్: మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి వైద్యులు గురువారం ఎస్పీ గంగాధరరావును కలిశారు. వైద్యులు ఆస్పత్రి భద్రత చర్యలపై ఎస్పీతో చర్చించారు. వైద్యుల భద్రత, ఉన్నతాధికారుల కాన్వాయ్ డ్యూటీ అంశాలపై మాట్లాడారు. ఎస్పీ ఆస్పత్రితో పాటు వైద్యులకు పూర్తి రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఎస్పీని కలిసిన వారిలో డాక్టర్ భానుమూర్తి, డాక్టర్ శ్రీనివాసులు, ఆర్ఎంఓ డాక్టర్ నిరంజన్ తదితరులు ఉన్నారు.



జిల్లా ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆస్పత్రి వైద్యులు

నాలుగు వేల మందికి అన్నసమారాధన

కోడూరు: కార్తిక మాసం పురస్కరించుకుని మండలంలోని లింగారెడ్డిపాలెం బాలాత్రిపురసుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి దేవాలయం వద్ద గురువారం నాలుగు వేల మందికి అన్నసమారాధన జరిగింది. గ్రామస్తులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి అన్నదానం చేశారు. మందపాకల, లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి, జరుగువానిపాలెం, కోడూరు గ్రామాలకు చెందిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం గోకర్ణేశ్వరుడి మూలమూర్తికి పంచామృతాభిషేకాలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించారు. ఈఓ సుధాకర్, జేఏ శివప్రసాద్ పర్యవేక్షించారు.



లింగారెడ్డిపాలెంలో జరిగిన అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు